క్లుప్తంగా

కాళికాంబదేవికి విశేష పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, గాజులతో విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం, పుష్పార్చన చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు చేసి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, లక్ష్మీదేవి, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రి, తిమ్మయ్య, నరసింహులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి



పార్కురోడ్డులోని నాగుల కట్టకు పాలు పోస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): శ్రావణమాసం నాగపంచమిని పురస్కరించుకుని భక్తులు శుక్రవారం ఉపవాస దీక్షలతో ఉదయాన్నే జంట నాగులకు పాలు, నీళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక పార్కు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల, మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం, కాళికాంబ చంద్రశేఖర దేవస్థానం, బైటిపేట ఆంజనేయస్వామి, సంజీవనగర్ రామాలయంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు వాయినాలు ఇచ్చుకుని ఒకరికొకరు పుచ్చుకున్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



బస్సును ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో నంద్యాల నుంచి మంత్రాలయానికి కొత్త హయ్యర్ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆర్టీసీలో ప్రయాణం చేసి ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఆర్టీసీ బస్సులు చివరి గ్రామాల వరకు నడుస్తున్నాయని తెలిపారు. జిల్లా రవాణా అధికారి రజియా సుల్తానా మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాకు 35 సూపర్ ఎక్స్‌ప్రెస్‌లు, 32 సెమీ లగ్జరీ బస్సులు వస్తున్నాయని వెల్లడించారు. 9 బస్సులు ఈనెల చివరిలోగా నంద్యాలకు చేరుతాయని తెలిపారు. విద్యార్థుల బస్సులకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు.

15న ప్రతి ఇంటిపైన జెండా ఎగురవేద్దాం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఆగస్టు 15వ తేదీ ప్రతి ఇంటిపై, ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేయాలని హర్‌గర్‌తిరంగ్ అభియాన్ రాయలసీమ జోనల్ కోఆర్డినేటర్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 11వ తేదీ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన నాయకులను స్మరిస్తూ మౌన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. 12,13 తేదీల్లో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కో ఆర్డినేటర్ అభిరుచి మధు, నాయకులు రామకృష్ణారెడ్డి, స్వాతి, బాలముని, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నంద్యాల తహసీల్దార్‌గా ప్రియదర్శిని

నంద్యాల(అర్బన్): నంద్యాల తహసీల్దార్‌గా ప్రియదర్శినిని నియమిస్తూ శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా డోన్ తహసీల్దార్‌గా నాగమణి, కలెక్టర్ కార్యాలయ కేఆర్ఆర్ సీటీ తహసీల్దార్‌గా అంజనా దేవిని నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. తక్షణమే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని, నైట్ డ్యూటీలను నిలుపుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఆవరణలో దర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్ఓ పద్మజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి భూపాల్, అధ్యక్షుడు నాగేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధంగా మన రాష్ట్రంలో కూడా పే స్కేల్ అమలు చేయాలని కోరారు. వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్ఏలు బాలుడు, బాలనరసింహులు, హరిబాబు, తిరుపాలు పాల్గొన్నారు.

కూలి దక్కదు.. కడుపు నిండదు

- ఉపాధి బకాయిలు రూ. 44.60 కోట్లు
- 90 రోజులుగా ఆగిన చెల్లింపులు
- వేతనాలు అందక కూలీల ఆకలి కేకలు
- నాడు రోజుకు లక్ష మందికి పైగా హాజరు
- నేడు రోజుకు 20 వేల లోపే..

ఓ వైపు అరకొర వర్షాలతో వ్యవసాయ పనుల్లేవు. మరో వైపు ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉపాధి పనులకు వెళ్లినా పస్తులే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉపాధి కూలీలకు రెండున్నర నెలలుగా పని చేస్తున్నా వేతనాలు అందక కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొంది. కేంద్రం నిధులు విడుదల చేసినా రాష్ట్రంలో నూతన కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఓటాన్ బడ్జెట్ కారణంగా ఇప్పట్లో క్షేత్రస్థాయికి అందే పరిస్థితి కనిపించడం లేదు.

ఉపాధి హామీ పథకం కూలీల వివరాలు..

ఉపాధి పనులు చేపట్టిన గ్రామ పంచాయతీలు	జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారు	జాబ్ కార్డులు మంజూరైన వారు
489	4,33,177	4,31,949

యాక్టివ్ జాబ్ కార్డులు 2,16,016	పనులకు హాజరవుతున్న కూలీలు 3,94,509

ఆళ్లగడ్డ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో పడకేసింది. మూడు నెలలుగా ఈ పథకం పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. క్షేత్రస్థాయిలో సిబ్బంది, అధికారులు కూలీలకు పని కల్పించి, పథకాన్ని నడిపిస్తున్నా పని చేసిన వారికి వేతనాలు రావడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మొదటగా వేతనాల సమస్య ఏర్పడింది. ఆ తర్వాత రెండు వారాల డబ్బులను కేంద్రం అందించింది. మళ్లీ పరిస్థితి మొదటికి రావడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. మే 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు ఉపాధి పనులు చేసిన కూలీలకు వేత్తనాలు చెల్లించ లేదు. దీంతో కూలీలు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. జిల్లాలో 28 మండలాల పరిధిలో 2,78,554 కుటుంబాల్లోని 5,24,210 మంది ఉపాధి హామీ పనుల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రతి రోజు పని దినాల లక్ష్యం 1,35,700గా నిర్దేశించగా 1.30 లక్షల మంది పనులకు హాజరయ్యేవారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు వారం నుంచి రెండు వారాల్లోపు వేతనాలు కచ్చితంగా అందించాలి. కాని ప్రస్తుతం సుమారు 12 వారాలు అవుతున్నా చేసిన పనులకు సంబంధించి వేతనాలు అందడం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు (జూలై 31) రూ. 44.60 కోట్ల కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. చేసిన పనులకు డబ్బులు ఎప్పుడు ఇస్తారా అని కూలీలు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా కూలీలు హాజరయ్యే మండలాలైనా డోన్, ప్యాపిలి, బనగానపల్లె, బేతంచెర్ల, ఆత్మకూరు, గోస్పాడు తదితర మండలాల్లోనే అత్యధికంగా కూలీలకు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో మండలంలో రూ. 4 కోట్లకు పైగానే బకాయిలు ఉన్నాయి. దీంతో క్షేత్రస్థాయి ఉపాధి సిబ్బంది కూలీలను పనులకు పిలవాలంటే జంకుతున్నారు. పిలిచేందుకు వెళ్లగానే నేరుగా బకాయి వేతనాలను అడుగుతున్నారు. ఏం సమాధానం చెప్పాలో దిక్కుతోచక మండల, డివిజన్ స్థాయి అధికారులు పల్లెలకు వెళ్లడమే మానేశారు.

ఉపాధి పడిపోతుంది ఇలా..

ఈ – మస్టర్ ప్రకారం పరిశీలిస్తే మే 1వ తేదీ వరకు జిల్లాలోని 489 గ్రామ పంచాయతీల పరిధిలో రోజుకు సుమారు 1.30 లక్షల మంది కూలీలు పని చేశారు. ఇప్పుడు కేవలం 165 పంచాయతీల్లో రోజుకు సుమారు 15 వేలు లోపు కూలీలే పనులకు వెళ్తున్నారు. 70 రోజుల వ్యవధిలో కూలీల సంఖ్య రమారమి 1.15 లక్షలు తగ్గినట్లే. ఇందుకు పూర్తిగా వేతన బకాయిలే కారణంగా స్పష్టమౌతోంది.

వ్యవసాయ పనులే దిక్కు

ఉపాధి పనులకు వెళ్లి చేతులకు బొబ్బలు వచ్చేలా పనిచేసినా సకాలంలో డబ్బులు అందక పోవడంతో ఉపాధి పనులంటేనే కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో జిల్లాలో ఎక్కువ శాతం ఉపాధి కూలీలు ప్రత్యామ్నాయంగా వ్యవసాయ పనుల మీద ఆధారపడుతున్నారు. గ్రామాల్లో చేతి నిండా పనులు లేక పోవడంతో సుదూర ప్రాంతాలకు ఆటోల్లో వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నారు. ఏ పని దొరకని కూలీలు మాత్రం ఉపాధి పనికే వెళ్తున్నారు.

మెటీరియల్ కాంపొనెంట్‌పై ప్రభావం

ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గితే దాని ప్రభావం మెటిరియల్ కాంపొనెంట్ నిధులపై పడుతుంది. వేతనాల చెల్లింపులో 60:40 కింద మెటీరియల్ కాంపొనెంట్ నిధులు వస్తాయి. ఆ నిధుల లభ్యతను బట్టి రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని అనుసంధానం చేసి గ్రామాల్లో సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాలు, మినీ గోకులాలుతో పాటు హౌసింగ్ పథకాలను చేపడుతుంది. మరోవైపు వర్షాకాలం కావడంతో పండ్ల మొక్కల పెంపకం లక్ష్యాలను పూర్తి చేయాలని నిర్ణయించారు. కూలీలకు వేతనాల చెల్లింపులు నిలిచిన కారణంగా మిగతా అభివృద్ధి పనులకు మెటీరియల్ కాంపొనెంట్ నిధులు సకాలంలో వస్తాయా లేదా? అన్నది అందరిలో ప్రశ్నార్థకంగా మారింది.



నాడు మిట్టపల్లెలో వందల సంఖ్యలో పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

బిల్లు కోసం ఎదురు చూస్తున్నా

నాతో కలిపి మొత్తం 5 మంది కుటుంబ సభ్యులం అందరం ఉపాధి పనులకు వెళ్లాం. 8 వారాలుగా కూలీ డబ్బులు పడలేదు. గతంలో వారవారం ఇచ్చేవారు. మాకు ఒక్కక్కరికీ వారానికి సుమారు రూ. 1,600 దాక వచ్చేది. ఈ లెక్కన మా ఐదుగురికి వారానికి రూ. 8 వేలు చొప్పున ఇప్పటి వరకు రూ. 64 వేల దాక బకాయి రావాల్సి ఉంటుంది. ఎప్పుడు వస్తుందో చెప్పలేక పోతున్నారు. బిల్లు కోసం నిరీక్షిస్తున్నాం.

– ఏసురత్నం, ఓబులంపల్లె

కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది

భార్యభర్తలిద్దరం ఉపాధి పనులకు వెళుతుండేవారం. కొన్ని నెలల క్రితం భర్త చనిపోవడంతో నేను ఒక్కదాన్నే ఉపాధి పనులకు వెళ్తున్నాను. ఉపాధి కూలీ తప్ప వేరే ఆధారం లేదు. రెండు నెలల నుంచి కూలీ డబ్బులు పడలేదు. ఈ పనులే నమ్ముకుని ఉన్నా. వారానికోసారి వచ్చే డబ్బులు ఆగి పోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉంది. చేసేదిలేక వ్యవసాయ పనులకు పోతున్నా.

– మార్తమ్మ, క్రిష్టిపాడు

వసతిగృహ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా

- ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి

చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామ ఎస్సీ వసతి గృహంలోని సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విశ్రాంతి గదులు, వంటశాల, ఆర్‌ఓ ప్లాంట్, మరుగుదొడ్లు, స్నానపు గదులు పరిశీలించారు. ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతు, గదులలో, ఆవరణంలో దెబ్బతిన్న బండ పరుపు తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ మదార్‌కు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ అనురాధ, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఈఓఆర్‌డీ తాహీర్‌హుసేన్, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ మురళీ కల్యాణి, ఐసీడీఎస్ నంద్యాల అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ తెలిపారు. స్థానిక జిల్లా మహిళా సమాఖ్య సమావేశ భవనంలో శుక్రవారం సాయంత్రం భేటీ బచావో.. భేటీ పడావో.. వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. కడుపులోనే భ్రూణ హత్యలకు పాల్పడకుండా ఆడపిల్లలను రక్షించి చదివించాలన్నారు. ఎవరూ ఆడపిల్లను తక్కువగా చూడవద్దని, అలాంటి సమస్యలు ఎదురైతే 1098, 100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పొలంబడి కార్యక్రమం



మాట్లాడుతున్న ఏడీఏ రాజశేఖర్

నంద్యాల(అర్బన్): పంట విత్తే సమయం నుంచి కోత వరకు వారంలో ఒక రోజు మేలైన వ్యవసాయ పద్ధతులతో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని ఏఓలు, ఏఈఓలు, వీఏఏలతో మేలైన వ్యవసాయ పద్ధతులతో పొలంబడి కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. పొలంబడికి సంబంధించి గ్రామ సభలు నిర్వహించి ఎంపిక చేసిన 30 మంది రైతులను ఎఫ్‌పీఓ (ఫార్మర్స్ ప్రొడ్యూజర్స్ ఆర్గనైజేషన్) కంపెనీ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. పంటల మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించేలా రైతులకు సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల మండల ఏఓ ప్రసాదరావు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మిడుతూరు: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన నాగార్జున (49) కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 6న శుభకార్యానికి హాజరయ్యేందుకు నాగార్జున ద్విచక్రవాహనంపై ప్రాతకోట గ్రామానికి వచ్చాడు. కార్యక్రమం ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. మిడుతూరు మండలం జలకనూరు బాట వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. మృతుడికి భార్య రమణమ్మ, నలుగురు కుతుళ్లు ఉన్నారు. మృతుడి సోదరుడు నాగశేషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రైతు వ్యతిరేక విధానాలపై నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశంలోని రైతులను కాపాడాలని డిమాండ్ చేస్తూ సేవ్ ఇండియా, సేవ్ అగ్రికల్చర్.. క్విట్ కార్పొరేట్ అనే నినాదంతో ఆందోళన చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు రైతాంగం పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. నల్ల చట్టాలను తెచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడం తగదన్నారు. నకిలీ విత్తనాలు, కల్తీ పురుగు మందులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శంకరయ్య, సోమన్న, సురేష్, మార్క్, అల్లాబకాష్, యాకూబ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పంట నమోదే లక్ష్యం



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

నంద్యాల(అర్బన్): మండలంలో సెప్టెంబర్ 15వ తేదీలోగా పంట నమోదు కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని ఏఓ ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం పుసులూరు, కానాల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పంట వేసిన ప్రతి రైతు వివరాలను వీఏఏ, వీహెచ్ఏ ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేసుకున్న వివరాలను బట్టే పంట నష్టం, ఇన్సురెన్స్, మద్దతు ధరపై పంట కొనుగోలు జరుగుతాయని, ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

ప్రణాళికతో లక్ష్య సాధన

నంద్యాల(న్యూటౌన్): ప్రతి విద్యార్థి ప్రణాళిక, క్రమశిక్షణతో చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చని ప్రొఫెసర్ నాగభూషణంరాజు అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆవిష్కరణ సంసిద్ధత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీబీఏ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకంగా, వినూత్నంగా ఆలోచించినప్పుడే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో శ్రావణకుమారి, ఇంతియాజ్ అహ్మద్, మోహన్‌రావు, బాలచంద్ర, దుర్గా, రామేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

ఆవులను రోడ్లపై వదిలితే గోశాలకు తరలిస్తాం

నంద్యాల(సిటీ): ఆవులను వీధులు, రోడ్లపై వదిలితే గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. యజమానులు ఆవులను ఇంటి వద్దనే సంరక్షించుకోవాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, వాణిజ్య కూడళ్ల వద్ద పశువులను వదిలి వేయడం వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐదు నెలల క్రితం గోవుల యజమానులకు నోటీసులు జారీ చేశామని.. ఆదేశాలకు బేఖాతరు చేస్తున్నారన్నారు. తీరు మార్చుకోకుంటే ప్రజారోగ్య చట్టం కింద గోవులను గోశాలకు తరలిస్తామన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా షేక్ షాను

నంద్యాల(అర్బన్): మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా షేక్ షానుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీపీఓ మంజులవాణి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడికి వచ్చిన సౌభాగ్యం తిరిగి వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

నేడు విద్యుత్ అంతరాయం

నంద్యాల(అర్బన్): నంద్యాల విద్యుత్ శాఖ డీ2 పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీ2 ఏఈ రామయ్య శుక్రవారం తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా హౌసింగ్‌బోర్డు, ఎన్‌జీఓ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, దేవనగర్, సాయిబాబానగర్, నౌమాన్‌నగర్, నర్స్ క్వార్టర్స్, గూడ్ షెడ్, కడప రోడ్డు, గెలివి ఫ్యాక్టరీ ఏరియా, విజయ మిల్క్ డెయిరీ, గిరిన్నాథ్‌సెంటర్, గోపాల్‌నగర్, పద్మావతినగర్, టెక్కె, సుద్దులపేట, భరతమాత టెంపుల్, విశ్వనగర్, లలితానగర్, గురురాఘవేంద్ర కోచింగ్ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉయ్యాలవాడలో..

ఉయ్యాలవాడ: మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శానిటేషన్ వర్కర్ల నూతన కమిటీ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. శానిటేషన్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా బాలవెంకట్, గౌరవ సలహాదారుగా నాగరాజు, అధ్యక్షుడు చెన్నయ్య, కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు ఫాతిమా, సుగుణమ్మ, హరిప్రియ, గురుస్వామి, సహాయ కార్యదర్శులుగా హరిప్రియ, లక్ష్మీకుమారి, శ్రీనివాసులు, జ్యోతి, సరస్వతి, రమణమ్మలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా కార్యదర్శి బాలవెంకట్ మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా ప్రభుత్వాస్పత్రి, మెడికల్ కళాశాలలో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గురుప్రసన్న బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



ఇటీవల కూలిన మట్టిమిద్దెను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

చాగలమర్రి: గురుప్రసన్న బాధ్యత ప్రభుత్వానిదేనని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మండలంలోని చిన్నవంగలి గ్రామంలో వారం క్రితం మట్టిమిద్దె కూలి గురుశేఖర్‌రెడ్డి, అతని భార్య, ఇద్దరు కూతుళ్లు మృతిచెందిన విషయం తెలిసిందే. శుక్రవారం కలెక్టర్ చిన్నవంగలి గ్రామాన్ని సందర్శించారు. కుటుంబాన్ని పోగొట్టుకుని అనాథగా మిగిలి 10వ తరగతి విద్యార్థిని గురుప్రసన్నను, ఆమె అవ్వ, తాతలను పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధితురాలు ప్రసన్నకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఉన్నత చదువులకు కూడా ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, హౌసింగ్ ఈఈ హరిగోపాల్, డీఈ నాగరాజు, ఎంఈఓ అనురాధ, ఏఈలు జగ్గయ్య, కొండారెడ్డి, షఫివుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, కార్యదర్శి వెంకటేశ్వర్లు, సర్పంచ్ మౌలిబాషా పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి

- జూనియర్ సివిల్ జడ్జి ఈశ్వరవెంకటేశ్వర ప్రసాద్



శిబిరంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి ఈశ్వరవెంకటేశ్వర ప్రసాద్

చాగలమర్రి: సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి ఈశ్వర వెంకటేశ్వర ప్రసాద్ సూచించారు. మండలంలోని ఒంటి గుడిసె తండాలో శుక్రవారం న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వంద మందికి పైగా పేషెంట్లకు ప్రభుత్వ వైద్యులు శబరీష్, తస్లీమా సుల్తానాలు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలీశ్వర్‌రెడ్డి, ఎస్ఐ రమణయ్య, పీపీ సోమశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది సోమశేఖర్, ప్యానెల్ న్యాయవాది షాహినాబేగం, గౌస్, విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సీహెచ్ఓ కృష్ణయ్య, ఏఎన్ఎం సంధ్య పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదయోగ్యం కాదు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్

చాగలమర్రి: వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదయోగ్యం కాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏదైనా ఒక ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే అధికారాన్ని వక్ఫ్ చట్టం 1995లో వక్ఫ్ బోర్డులకు రాజ్యాంగం కల్పించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం కొత్త బిల్లును ప్రవేశ పెట్టి సెక్షన్–40 రద్దుకు ప్రతిపాదించి, వక్ఫ్ బోర్డు చేతుల్లో ఉన్న అధికారాన్ని లాగేసుకుంటోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డుల స్వయంప్రతిపత్తిని తగ్గించి వక్ఫ్ ఆస్తులపై పూర్తి హక్కులను కలెక్టర్లకు ఇవ్వడం ముస్లింల హక్కులను హరించడమేనన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కుటమి ప్రభుత్వం సవరణ బిల్లుకు మద్దతు చూస్తే ముస్లింలపై వారికున్న వైఖరి అర్థమవుతుందన్నారు.

‘వరి’ంచేలా



కుందూనది పరివాహక ప్రాంతంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

దొర్నిపాడు: వర్షం రైతులను వరించేలా చేసింది. కుందూనది, కేసీ కెనాల్‌కు పుష్కలంగా సాగునీరు రావడంతో వరినాట్ల పనులు ముమ్మరం చేశారు. మండలంలోని క్రిష్టిపాడు, గుండుపాపల గ్రామాల్లో నాట్లు వేస్తుండగా దొర్నిపాడు, అమ్మిరెడ్డినగరం, రామచంద్రాపురం, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల అర్జునాపురం, కొండాపురం, భాగ్యనగరం గ్రామాలు కేసీ కింద ఉండటంతో నారుపోస్తున్నారు. ప్రతి 3వేల హెక్టార్ల వరకు వరిసాగు చేస్తారని వ్యవసాయాధికారి సునీత తెలిపారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నంద్యాల, ఆళ్లగడ్డ

99122 20581 (నంద్యాల)

70750 09103 (ఆళ్లగడ్డ)

Office mail : sakshiknladvt@gmail.com